సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 12 । జూలై । 2024



నిజాయితీగా ఉండడం వల్లే ..

నిజాయితీగా ఉండడం వల్లే ఎన్నికల్లో టికెట్ రాలేదని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు.

- 8లో



ఓజో అగ్రికేర్‌లో అగ్ని ప్రమాదం

ధర్మోజిగూడెం శివారులో గల ఓజో అగ్రికేర్ పరిశ్రమలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది.

- 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32°/ 25°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యాదాద్రిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. అలాగే ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం వేళ ఉత్సవమూర్తుల జోడు సేవలను మాడవీధిలో ఊరేగించారు.

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

భువనగిరి : జిల్లా వ్యాప్తంగా గురువారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయ్యాయి.సర్వర్ డౌన్ కావడంతో ఉదయం 11నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రక్రియ నిలిపోయింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. సుమారు 40 వరకు రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉండగా అవన్నీ నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. సర్వర్ డౌన్ కావడం వల్లే సమస్య తలెత్తినట్లు పేర్కొన్నారు.

డీజీపీని కలిసిన ఐలయ్య



నూతన డీజీపీ జితేందర్‌కు యాదాద్రీశుడి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ప్రభుత్వ విప్

యాదగిరిగుట్ట : రాష్ట్ర నూతన డీజీపీ జితేందర్‌ను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేసి, శాలువాతో సన్మానించారు. శాంతిభద్రతల విషయంలో పోలీసు శాఖకు సహకరించాలని డీజీపీ ఈ సందర్భంగా సూచించినట్లు ఐలయ్య తెలిపారు.

పాముకుంట టీచర్‌కు సైన్స్ ఎడ్యుకేషన్ అవార్డు



ఉపాధ్యాయురాలు పారిజాతకు అవార్డు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

రాజాపేట : మండలంలోని పాముకుంట గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్రం ఉపాధ్యాయురాలు పారిజాతకు మాస్టర్ ట్రెనింగ్ ఇన్ సైన్స్ ఎడ్యుకేషన్ అవార్డు లభించింది. టెక్ మహేంద్ర ఫౌండేషన్, సహాయత ట్రస్టు వారి సహకారంతో సైన్స్ ఎడ్యుకేషన్‌పై ఢిల్లీనుంచి వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబరచడంతో ఆమెకు అవార్డు దక్కింది. అవార్డును గురువారం పాఠశాల హెచ్‌ఎం చంద రమేష్ ఆమెకు అందజేశారు. అలాగే ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బేసిక్ కౌన్సిలింగ్ స్కిల్స్ కోర్సు (విద్యలో వెనుకబడిన విద్యార్థులను ఎలా తీర్చిదిద్దాలో) పూర్తి చేసినందుకు గాను ఆమెకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గౌటె బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



గురుకుల పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

రాజాపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల అటెండెన్స్ రికార్డులు, భోజనం, పరిసరాలను పరిశీలించారు. మెనూ అమలుపై ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావును అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో పెరిగిన గడ్డిని తొలగించాలని సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ దామోదర్, ఎంపీడీఓ నాగవేణి ఉన్నారు.

ఆరు లేన్లకు సన్నాహాలు

త్వరలో మొదలుకానున్న హైదరాబాద్ – విజయవాడ హైవే విస్తరణ



ఆరు వరుసలుగా మారనున్న హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి

- నష్టాల సాకుతో కాంట్రాక్ట్ సంస్థ కోర్టుకెళ్లడంతో ఇంతకాలం ఆగిన పనులు
- ఇటీవల టోల్ నిర్వహణ బాధ్యతల నుంచి జీఎంఆర్‌ను తప్పించిన కేంద్రం
- కొత్త ఏజెన్సీలకు అప్పగింత
- విస్తరణకు తొలగిన అడ్డంకులు

చౌటుప్పల్ : హైదరాబాద్ – విజయవాడ(ఎన్‌హెచ్ -65) జాతీయ రహదారి ఆరు లేన్ల పనులు రెండు నెలల్లో ప్రారంభంకానున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నాటికే విస్తరణ పనులు పూర్తి కావాల్సి ఉండగా.. హైవేను నాలుగు లేన్లుగా విస్తరించిన జీఎంఆర్ సంస్థ నష్టాల సాకుతో కోర్టును ఆశ్రయించింది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ తగ్గిందని, నష్ట పరిహారం చెల్లించాలని న్యాయస్థానంలో పిటిషన్ వేయడంతో ఆరు లేన్ల విస్తరణ ఇంతకాలం ఆగిపోయింది. కాగా టోల్ నిర్వహణ బాధ్యతల నుంచి జీఎంఆర్‌ను తప్పిస్తూ ఇటీవల కేంద్రం నిర్ణయం తీసుకుంది. అడ్డంకులు తొలగిపోవడంతో విస్తరణ పనులకు జాతీయ రహదారి సంస్థ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

2012లో నాలుగు లేన్లు పూర్తి

రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే జాతీయ రహదారి–65ను ఎక్స్‌ప్రెస్‌వేగా మార్చడానికి 2007లోనే మంజూరు లభించింది. బిడ్ దక్కించుకున్న జీఎంఆర్ సంస్థ.. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామ వరకు 181 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణకు టెండర్లు వేసింది.రూ.1,740 కోట్ల అంచనా వ్యయంతో 2010 మార్చిలో నాలుగు లేన్ల పనులను ప్రారంభించి 2012లో పూర్తి చేసింది. హైవేపై తెలంగాణలోని చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు వద్ద మొత్తం మూడు టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేసింది. 2025 వరకు టోలు ఫీజు వసూలుకు కేంద్ర ప్రభుత్వం గడువు ఇచ్చింది. అందులో భాగంగా ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు సంస్థ యజమాన్యం టోల్ వసూలు చేసింది. ఇంకా ఏడాది పాటు గడువు ఉంది.

నష్టాలు వస్తున్నాయని..

2024 లోపు ఆరు లేన్లుగా విస్తరించాలని నాటి ఒప్పందంలో ఉంది. అయితే 2014లో ఉమ్మడి రాష్ట్రం విభజన జరిగిన తర్వాత వాహనాల రాకపోకలు తగ్గాయని, తద్వారా ఆదాయం భారీగా తగ్గి నష్టాలు వస్తున్నాయని జీఎంఆర్ యాజమాన్యం కోర్టును ఆశ్రయించడంతో విస్తరణ నిలిచిపోయింది. రాష్ట్ర విభజన అనంతరం రెండు ప్రభుత్వాలు ఆరు లేన్ల విస్తరణకు ప్రయత్నాలు చేసినప్పటికీ కోర్టు కేసు మూలంగా ముందుకు సాగలేదు.

మరో ఏడాది ఉండగానే టోల్ వసూలు బాధ్యతల నుంచి తొలగింపు

జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించిన జీఎంఆర్ సంస్థకు టోలు వసూలు గడువు మరో ఏడాది ఉంది. అయితే ఆరు వరుసల రోడ్డు నిర్మించడం లేదన్న కారణంతో జీఎంఆర్‌ను టోలు వసూలు నుంచి కేంద్ర ప్రభుత్వం ఇటీవల తప్పించింది. టోల్ నిర్వహణ బాధ్యతలు మరో ఏడాది కాలం ఉండగానే సంస్థను తప్పించి.. కొత్త ఏజెన్సీలను నియమించింది. గడువుకు ముందే టోల్ బాధ్యతల నుంచి తప్పించడంతో జీఎంఆర్ సంస్థకు పరిహారం చెల్లించాలని కేంద్రం నిర్ణయించింది. అడ్డంకులు తొలగిపోవడంతో రెండు నెలల్లో పనులు కొలిక్కి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. 2019–23 వరకు భువనగిరి ఎంపీగా ఉన్న ప్రస్తుత రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎంతో చొరవ తీసుకొని ఎన్‌హెచ్–65 విస్తరణ ఆవశ్యకతను అనేకమార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో అడ్డంకులు తొలగిపోయాయి.

అధికారులతో సమీక్షలు, దిశానిర్దేశం

హైదరాబాద్ – విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు వేగం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి సంబంధిత అధికారులతో పలుమార్లు సమావేశమై విస్తరణపై సమీక్షలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా హైవేపై రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో ఇప్పటికే గుర్తించిన 17బ్లాక్ స్పాట్‌ల వద్ద అండర్‌పాస్‌ల నిర్మాణ పనులకు ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిట్యాల వద్ద శంకుస్థాపన కూడా చేశారు. అంతేకాకుండా కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేయనున్న ట్రామా కేర్ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలోనూ ఆరు లేన్ల విస్తరణ పనులకు రెండు నెలల్లో శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు.



భువనగిరిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పాపారావు


అధిక జనాభాతో దుష్పరిణామాలు

- డీఎంహెచ్‌ఓ పాపారావు

భువనగిరి : జనాభా పెరుగుదల వల్ల అనర్థాలే ఎక్కువని, పేదరికం, నిరుద్యోగం, ఆహార సమస్యలు ఏర్పడుతాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.పాపారావు పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతుల ద్వారా జనాభా పెరగకుండా అరికట్టవచ్చన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ అధిక జనాభా వల్ల కలిగే దుష్ప్రరిణామాలు, చిన్న కుటుంబాల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలకు వివరించాలన్నారు. శాశ్వత కుటుంబ నియంత్రణతో పాటు ప్రత్యామ్నాయ పద్ధతులపై ప్రోత్సహించాలన్నారు. పురుషులు అపోహ చెందకుండా ఎన్‌ఎస్‌వీ ఆపరేషన్ చేయించుకునేందుకు ముందుకురావాలన్నారు. మొదటి, రెండవ బిడ్డ మధ్య కనీసం మూడేళ్ల వ్యవధి పాటించేలా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్‌ఓ యశోధ, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రామకృష్ణ, సుమన్ కళ్యాణ్, డెమో మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఈలు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రాంబాబు, నరసింహ పాల్గొన్నారు.

ఎలా ముందుకెళ్దాం!

- రాయగిరి పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు భూ సేకరణను కొలిక్కి తెచ్చే ప్రయత్నం
- హైకోర్టులో స్టే వెకేట్ చేయించేందుకు ప్రయత్నాలు
- అధికారులతో సమావేశమైన కలెక్టర్
- కౌంటర్ దాఖలుకు రేపు అడ్వకేట్ జనరల్‌ను కలిసే అవకాశం



సాక్షి,యాదాద్రి : రాయగిరి పరిధిలో పెండింగ్‌లో ఉన్న రీజినల్ రింగ్‌రోడ్డు భూ సేకరణ అంశం కీలకదశకు చేరింది. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయంలో కలెక్టర్‌తో సమావేశమై భూసేకరణలో జరుగుతున్న జాప్యానికి గల కారణాలపై సమీక్షించారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని, హైకోర్టులో స్టేను వెకేట్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ హనుమంతు కే.జెండగే గురువారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. రైతులు హైకోర్టును ఎందుకు ఆశ్రయించారు, ఏఅంశాల ప్రాతిపదికన వారికి స్టే వచ్చిందన్న అంశాలపై చర్చించారు. శుక్రవారం నేషనల్ హైవే అథారిటీ అధికారులతో ఏజీని కలిసి కోర్టులో కౌంటర్ దాఖలు చేయాలని కోరనున్నట్లు తెలుస్తోంది.

రైతులు ఏ అంశాల ప్రాతిపదికన హైకోర్టును ఆశ్రయించారంటే..

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ముందుగా ఇచ్చిన గెజిట్ ప్రకారం కాకుండా అలైన్‌మెంట్ మారుస్తూ రెండోసారి గెజిట్ విడుదల చేసింది. అలైన్‌మెంట్ మార్చడం వల్ల తాము భూములు కోల్పోతామని భువనగిరి మండలంలోని రాయగిరి రైతులు 30 మంది హైకోర్టును ఆశ్రయించారు. తాము ఇప్పటికే కాళేశ్వరం, బునాదిగాని కాల్వలు, జాతీయ రహదారి –163, విద్యుత్ టవర్ల కోసం పెద్ద ఎత్తున భూములు కోల్పోయామని కోర్టు దృష్టికి తెచ్చారు. మరోసారి భూములు ఇవ్వలేమని, మొదట ఇచ్చిన గెజిట్ ప్రకారంగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించాలని పిటిషనల్‌లో పేర్కొన్నారు. తమ గ్రామ పరిధిలో అలైన్‌మెంట్ మార్చాలని, అప్పటి వరకు భూసేకరణ నిలిపివేయాలని కోరారు. రైతుల పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. భూ సేకరణపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

తాజా పరిణామాలతో రైతుల్లో ఆందోళన..

హైకోర్టులో స్టే వెకేట్ చేయించేందుకు యంత్రాంగం ప్రయత్నాలు ముమ్మరం చేయడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కోర్టు నుంచి ఏ విధమైన తీర్పు వస్తుందోనని చర్చించుకుంటున్నారు.

ఎయిమ్స్‌లో మెరుగైన దంత వైద్య సేవలు

బీబీనగర్ : దంత సమస్యలతో బాధపడుతున్న వారికి బీబీనగర్ ఎయిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా తెలిపారు. ఎయిమ్స్‌లో డెంటిస్ట్రీ విభాగంతో పాటు ఓపీజీ యంత్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దంత సమస్యలు ఉన్న రోగులకు ఓపీజీ మెషిన్ ద్వారా సమగ్ర చికిత్స అందించవచ్చన్నారు. దవడలను స్కానింగ్ చేయడానికి ఓపీజీ మిషన్ దోహదపడుతుందన్నారు. చిన్న పిల్లల్లోనూ చికిత్స సులభంగా చికిత్స చేయవచ్చన్నారు. దంత సమస్యలున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ రాహుల్ నారంగ్, అకాడమిక్ వైద్యులు అభిషేక్ ఆరోరా, వైద్యులు సంగీతసంపత్, బిపిన్‌వర్గీస్, అనురాగ్‌నేగి, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.



ఎయిమ్స్‌లో ఓపీజీ యంత్రం ప్రారంభోత్సవం సందర్భంగా జ్యోతి వెలిగిస్తున్న డైరెక్టర్ భాటియా

ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్ : విదేశాల్లో ఉన్నత విద్యకోసం నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్‌న పొందాలనుకుంటున్న విద్యార్థులు ఆగస్టు 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలన్నారు. ఒక కుటుంబం నుంచి ఒక్కరికే అవకాశం ఉంటుదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేపర్ పడవలతో వినూత్న నిరసన



యాదగిరిగుట్ట పట్టణం నుంచి పాతగుట్టకు వెళ్లే దారిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో పేపర్‌తో తయారు చేసిన పడవలు వదిలి నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణం నుంచి పాతగుట్టకు వెళ్లే దారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో కాగితపు పడవలు వదిలి నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనలో రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో భక్తులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారని, అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నరేష్, బీజేవైఎం అధ్యక్షుడు బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు అజయ్, ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు ఆలేటి కర్ణ, పగిడిపల్లి రాము, శివరాత్రి శ్రీశైలం, సూధగాని శివ, కర్రె శ్యాం, కాలూరి విజయ్, సన్నీ, బీమగాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'సీజనల్' పై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేకాధికారులు, వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లతో సమావేశమై సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేయాలని, ఫాగింగ్ చేయాలని, గుంతలు పూడ్చాలని సూచించారు. ప్రతి నెలా 1, 11, 21 తేదీల్లో తప్పనిసరిగా వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, టైర్లు, పూలకుండీలు, ఫ్రిడ్జ్‌లు, కూలర్లు, కొబ్బరిబోండాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. పశువులు మేకలు, గొర్రెలకు ఏర్పాటు చేసిన తొట్టెల్లో నీరు ఎక్కువ కాలం ఉండకుండా ఏరోజుకారోజు తొలగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ఇళ్ల ఆవరణలు, పరిసరాలు, ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించాలని స్పష్టం చేశారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత కూడా పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హాస్టళ్లు, పాఠశాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. డీఎంహెచ్‌ఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి ఫోన్ నంబర్లను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో వుంచాలన్నారు. డెంగీ కేసులు నమోదైతే ర్యాపిడ్ యాక్షన్ టీంల సహాయంతో ఇంటింటి జ్వర సర్వే చేపట్టాలని, అందరికీపరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందజేయాలని ఆదేశించారు. సీరియస్‌గా ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రులకు తరలించాలన్నారు. జ్వరం కేసులు ఎక్కువగా నమోదయ్యే గ్రామాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలని, అతిసార విషయంలోనూ అలర్ట్‌గా ఉండాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, చిత్రంలో అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ

కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించండి

కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధిక జనాభా వల్ల కలిగే దుష్పరిణామాలపైనా ప్రజలకు వివరించాలని, చిన్న కుటుంబాల ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వైద్యులు, సిబ్బందికి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టరు గంగాధర్, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాపారావు, డీపీఓ సునంద పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చి మాట నిలుపుకోవాలి

భువనగిరిటౌన్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భువనగిరి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కనీస వేతనం పెంచుతామని, ఈఎస్‌ఐ, పీఎఫ్ వర్తింపజేస్తామని, వారాంతపు సెలవులు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా అమలు చేయడం లేదన్నారు. హామీలు నెరవేర్చి మాటనిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఉదరి రామచందర్ లక్ష్మీనారాయణ, బట్టు కొండయ్య, రవి, రాములు, యాదగిరి, రాజయ్య, నరసింహ, శ్రీధర్, నరేష్, శ్రీను, వరమ్మ, సునీత, రేణుక, అనిత, సుమీల, శ్యామల, రాణి తదతరులు పాల్గొన్నారు.



భువనగిరిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పచ్చని అందాలు

భూదాన్‌పోచంపల్లి చెరువు సమీపంలో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. నిండుకుండలా చెరువు, చెంతనే పచ్చని పొలాలు, నీలి మేఘాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి.

- భూదాన్‌పోచంపల్లి



క్లుప్తంగా

కేఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి



స్వయం ప్రతిపత్తి హోదాపత్రాలను చూపుతున్న అధ్యాపకులు

కోదాడ : కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) ఈ విద్యాసంవత్సరం నుంచి ఐదు సంవత్సరాల వరకు స్వయం ప్రతిపత్తిని ప్రకటించింది. ఈ మేరకు యూజీసీ డిప్యూటీ కార్యదర్శి డాక్టర్ గోపిచంద్ మెరుగు మహాత్మాగాంధీ యూనివర్సిటీకి సమాచారం అందించారు. 2024–25 విద్యాసంవత్సరం నుంచి 2028–2029 విద్యా సంవత్సరం వరకు ఈ అనుమతి లభించనుంది. దీనిని రెన్యూవల్ చేసుకోవడానికి గడువు ముగిసే సమయానికి మూడు నెలల ముందు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. తమ కళాశాలకు స్వయం ప్రతిపత్తి రావడం పట్ల ప్రిన్సిపాల్ ఎం.నాగు, అధ్యాపకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు.

పులి సంచారం వదంతులను నమ్మొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్

చింతపల్లి : చింతపల్లి మండలంలోని అనాజిపురం గ్రామంలో రెండు రోజుల నుంచి పులితో పాటు పులి పిల్లలు సంచరిస్తున్నాయన్న వదంతులను గ్రామస్తులు నమ్మొద్దని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన గ్రామాన్ని సందర్శించి రైతులు, గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో అడవి జంగవిల్లులు సంచరిస్తున్నాయని, పులి ఉన్నట్లు వస్తున్న వదంతులను నమ్మొదని, అది కేవలం అడవి పిల్లి మాత్రమేనన్నారు. అటవీ ప్రాంతం లేనందున పులి వచ్చే అవకాశం లేదన్నారు.

ఉరేసుకుని బాలిక బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్: ఉరేసుకుని బాలిక బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో గురువారం జరిగింది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన బాలిక (13) స్కూల్‌కు వెళ్లలేదని తల్లి మందలించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి ఉరివేసుకుని వేలాడుతున్న కూతురును చూసి బోరున విలపించింది. స్థానికుల సహాయంతో ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

పరారీలో నిందితులు

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామ పరిధిలోని చింతలగూడేనికి కొత్త కళ్యాణి ఆత్మహత్యకు కారణమైన నిందితులు పరారీలోనే ఉన్నారు. ఇద్దరు యువకులు వాట్సాప్, సోషల్ మీడియాలో కళ్యాణి ఫొటోలను స్టేటస్‌గా పెట్టుకుంటామని బెదిరించడంతో ఆమె కలుపు నివారణ మందు తాగి నల్లగొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కళ్యాణి మృతికి కారణమైన యువకులను పట్టుకోవడానికి పోలీసులు మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల బంధువుల ఇళ్లలో విచారించడంతో పాటు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వారిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఒకరైన కొమ్మనబోయిన మధు నిద్రమాత్రలు మింగి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఓజో అగ్రికేర్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు
- ప్రొడక్షన్ బ్లాక్‌లోని రియాక్టర్లు పేలడంతో పెరిగిన ప్రమాద తీవ్రత
- కూలిపోయిన ప్రొడక్షన్ యూనిట్ షెడ్
- పూర్తిగా దెబ్బతిన్న భవనాలు, యంత్రాలు, ముడిసరుకు
- రూ.40కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా



ఓజో అగ్రికేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలోని ప్రొడక్షన్ బ్లాక్‌లో ఎగిసిపడుతున్న మంటలు



అగ్నిప్రమాదం కారణంగా దెబ్బతిన్న ముడిసరుకు

చౌటుప్పల్: చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం రెవెన్యూ పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామ శివారులో గల ఓజో అగ్రి కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రొడక్షన్ బ్లాక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రొడక్షన్ బ్లాక్‌లోని రియాక్టర్లు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. పరిశ్రమ నిర్వాహకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో ఏర్పాటు చేసిన ఓజో అగ్రి కేర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో వ్యవసాయానికి సంబంధించిన పలు రకాల క్రిమిసంహారక మందులను ఉత్పత్తి చేస్తారు. ఈ పరిశ్రమలో సుమారు 70మంది పనిచేస్తున్నారు. పరిశ్రమలో ఉదయం ఉత్పత్తి జరుగుతుండగా.. రాత్రి సమయంలో మరుసటిరోజు ఉదయానికి అవసరమైన ప్రొడక్షన్‌ను మిక్సర్ యూనిట్ల ద్వారా తయారు చేసుకుంటారు. రోజుమాదిరిగానే బుధవారం రాత్రి ఉద్యోగులు, కార్మికులు ఇళ్లకు వెళ్లిపోయారు. ఆరుగురు సిబ్బంది మాత్రం రాత్రి విధుల్లో ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు

అర్ధరాత్రి 1.30గంటల సమయంలో ప్రొడక్షన్ బ్లాక్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వచ్చాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో మంటలను గమనించలేదు. అనంతరం దట్టమైన పాగతో మంటలు ఎగిసిపడుతుండడంతో ప్రధాన ద్వారం వైపున ఉన్న సిబ్బంది గమనించి కంపెనీ నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాద తీవ్రతను పరిశీలించి మంటలను అదుపు చేసేందుకు చౌటుప్పల్‌తో పాటు రామన్నపేట, హయత్‌నగర్, ఎల్‌బీనగర్, భువనగిరి, ఆలేరు నుంచి ఫైర్ ఇంజన్లను రప్పించారు.

ముడి సరుకు, రియాక్టర్లతోనే పెరిగిన ప్రమాద తీవ్రత

ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పరిశ్రమలో పెద్దఎత్తున ఉత్పత్తి జరుగుతోంది. బుధవారం రాత్రి ప్రొడక్షన్ బ్లాక్‌లో 100రకాల ఉత్పత్తులకు సంబంధించిన ముడి సరుకు ఉంది. ఆయా ఉత్పత్తులను గురువారం ప్యాకింగ్ చేయాల్సి ఉండేది. ప్యాకింగ్ చేసే అట్టలకు అంటుకున్న మంటలు ఉధృతం కావడంతో పక్కనే ఉన్న 8 రియాక్టర్లు పేలిపోయాయి. దీంతో ప్రొడక్షన్ బ్లాక్‌తో పాటు పక్కనే ముడి సరుకు భద్రపరిచే మరో బ్లాక్‌కు మంటలు అంటుకుని కూలిపోయాయి. ఆరు ఫైర్ ఇంజన్‌లు, స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకర్ల ద్వారా గురువారం ఉదయం 10గంటల ప్రాంతంలో మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే కూలిపోయిన శిథిలాల కింద మళ్లీ మంటలు వ్యాపించడంతో వాటిని అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ధ్వంసమైన భవన శిథిలాలను జేసీబీలతో కూల్చివేశారు. మధ్యాహ్నం 12గంటల తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రూ.40కోట్లకు పైగా నష్టం..

ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ. 40కోట్లకు పైగా నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. రవికుమార్ తెలిపారు. 100రకాల ఉత్పత్తులకు సంబంధించిన ముడి సరుకు ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిందన్నారు. దాని విలువ సుమారు రూ.30కోట్లు ఉంటుందని, అదేవిధంగా రూ.12కోట్ల విలువైన యంత్రాలు, రూ.10కోట్ల విలువైన వివిధ భవనాలు, షెడ్లు కూలిపోయాయని ఆయన పేర్కొన్నారు. సీఐ అశోక్‌రెడ్డి దగ్గరుండి మంటలను ఆర్పించే చర్యలు చేపట్టారు. మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు ప్రొడక్షన్, ముడి సరుకు భద్రపరచే ప్లాంట్లను పరిశీలించి ప్రాథమిక అంచనా రూపొందించారు. అదేవిధంగా పరిశ్రమను వివిధ శాఖల అధికారులు సైతం సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.



ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన యంత్రాలు



పూర్తిగా కూలిపోయిన షెడ్లు

పోలీసులకు శిక్షణ ఎంతో కీలకం

- తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, అడిషనల్ డీజీపీ అభిలాష బిస్త్



మాట్లాడుతున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్

నల్లగొండ క్రైం: పోలీసులకు శిక్షణలో ఎంతో కీలమని, శిక్షణలో నేర్చుకున్న అంశాలు క్షేత్ర స్థాయిలో ఉపయోగపడతాయని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్, అడిషనల్ డీజీపీ అభిలాష బిస్త్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని, అన్నెపర్తి 12వ బెటాలియన్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని ఆమె ఎస్పీ శరత్‌చంద్ర పవార్, బెటాలియన్ కమాండెంట్ ఎన్‌వీ సత్య శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. పోలీస్ శిక్షణలో నేర్చుకున్న అంశాలు క్షేత్ర స్థాయిలో ఉపయోగపడతాయన్నారు. పోలీసు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు అందుతున్న సౌకర్యాలను ఆమె పరిశీలించారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించే అవకాశం కేవలం పోలీసు శాఖకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డీటీసీ వైస్ ప్రిన్సిపాల్ విఠల్‌రెడ్డి, ఆర్ఐ హరిబాబు, ఎస్ఐలు క్రాంతికుమార్, బాబు, శ్రీనివాస్, భరత్, అఖిల్, అసిస్టెంట్ కమాండెంట్లు వెంకటేశ్వర్లు, రవిచంద్రన్, పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీదే భవిష్యత్తు

- బీజేపీ నేత రాంచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

సూర్యాపేట : ప్రజల ఆశీర్వాదంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీదే భవిష్యత్తు అని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత రాంచందర్‌రావు అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని బాలాజీగార్డెన్‌లో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలతో తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయిందన్నారు. పార్టీని రెండో స్థానంలోకి తీసుకొచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ప్రజల తరఫున పోరాటాలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ నుంచి గ్రామ, మండల స్థాయి నాయకులందరూ బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణంరాజుకు నాలుగు గెజిటెడ్ ఉద్యోగాలు

- డిగ్రీ, జూనియర్ కాలేజీ, పాలిటెక్నిక్, గురుకుల లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపిక
- స్వస్థలం శాలిగౌరారం మండలం అడ్లూరు
- ప్రస్తుతం బాసర ట్రిపుల్ ఐటీలో ఫిజిక్స్ లెక్చరర్‌గా విధులు



కృష్ణంరాజు

శాలిగౌరారం: ప్రభుత్వ ఉద్యోగ సాధనలో ప్రస్తుతం పెరిగిన తీవ్రమైన పోటీ నేపథ్యంలో ఒక ఉద్యోగాన్ని పొందడమే కష్టంగా మారిన తరుణంలో ఒక వ్యక్తి ఒకటి, రెండు కాదూ ఏకంగా నాలుగు ప్రభుత్వ గెజిటెడ్ ఉద్యోగాలను సాధించాడు. వివరాలలోకి వెళ్తే.. శాలిగౌరారం మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన వరికుప్పల కృష్ణంరాజుది వ్యవసాయ కుటుంబం. ఇంటర్మీడియట్ మినహా ఇస్తే ప్రాథమిక విద్య నుంచి పీజీ వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యాభ్యాసం చేశాడు. 2008లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తిచేసిన వెంటనే 2008లో బాసర ట్రిపుల్ ఐటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఫిజిక్స్ లెక్చరర్‌గా విధుల్లో చేరి నేటి వరకు అక్కడే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో భాగంగా ఇటీవల వెలువడిన పలు ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి డిగ్రీ, జూనియర్ కాలేజీ, పాలిటెక్నిక్, గురుకుల లెక్చరర్ ఉద్యోగాలు సాధించారు. అందులో గురుకుల డిగ్రీ లెక్చరర్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 7వ ర్యాంకు, మల్టీజోన్–2లో 4వ ర్యాంకు సాధించి డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాన్ని సాధించారు. అదే విధంగా గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, మల్టీజోన్–2లో ప్రథమ ర్యాంకు, పాలిటెక్నిక్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు, మల్టీజోన్–2లో 6వ ర్యాంకు, జనరల్ జూనియర్ లెక్చరర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంకు, బీసీ (ఏ) కేటగిరిలో మల్టీజోన్–2లోను, రాష్ట్ర స్థాయిలోనూ ప్రథమ ర్యాంకు సాధించి వరుసగా నాలుగు గెజిటెడ్ ఉద్యోగాలకు ఎంపిక య్యాడు. కృష్ణంరాజు ఒకేసారి నాలుగు ప్రభుత్వ గెజిటెడ్ ఉద్యోగాలను సాధించడం పట్ల అతడి కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ సాధనలో సహకరించిన సన్నిహితులకు కృష్ణంరాజు కృతజ్ఞతలు తెలిపారు.

దేశ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

హాలియా : సమాజంలో ప్రతి విద్యార్థి సినిమా హీరోలను కాకుండా దేశ నాయకులను ఆదర్శంగా తీసుకొని తమ భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుకుంటే అప్పుడే సార్థకత కలుగుతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జేడీ ఫౌండేషన్, ఫ్రెండ్స్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో అనుముల మండలంలోని పంగవానికుంటతండాలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు పాఠశాలల విద్యార్థుల ముఖాముఖీ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో లక్ష్యాన్ని సాధించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి తమ జీవితాలను బంగారుమయంగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సెయింట్ మార్టిన్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ప్రవీణ్‌సింగ్, మండల విద్యాధికారి బాలునాయక్, జేడీ ఫౌండేషన్ కన్వీనర్ కవిత, పర్యావరణ వేత్త సురేష్ గుప్తా, ఫ్రెండ్స్ యూత్ సొసైటీ ఫౌండర్ మోగావత్ కొండానాయక్, అధ్యక్షుడు భరత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, అంజి, సాయి, రమేష్, సురేష్, శ్రీను, కార్తీక్, నవీన్ కుమార్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

యాదాద్రిలో సీపీ సుధీర్‌బాబు పూజలు



సీపీ సుధీర్‌బాబుకు ఆశీర్వచనం చేస్తున్న ఆలయ అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాచకొండ నూతన సీపీ సుధీర్‌బాబు గురువారం రాత్రి సందర్శించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారి ఆలయానికి రావడంతో అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించున్న సీపీ సుధీర్‌బాబుకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయాధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. సీపీ వెంట డీసీపీ రాజేష్‌చంద్ర, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

కలుషిత జలాలు తాగి పాడి గేదె మృతి

బొమ్మలరామారం: మండలంలోని రామలింగంపల్లి గ్రామంలో కలుషిత జలాలు తాగి పాడి గేదె మృతిచెందింది. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. రామలింగంపల్లి గ్రామ వాసి మచ్చాని తిరుపతికి చెందిన పాడి గేదె బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలోని రామయ్య చెరువు వద్ద మేతకు వెళ్లి చెరువులోని నీటిని తాగింది. అనంతరం అక్కడి నుంచి గేదె ఆయాసపడుతూ పశువుల కొట్టానికి చేరుకుంది. తిరుపతి గురువారం తెల్లవారుజామున పశువుల కొట్టానికి వెళ్లి చూడగా గేదె మృతిచెంది కనిపించింది. రామయ్య చెరువులో నీరు తాగడంతోనే తన గేదె మృతి చెందిందని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట గేదె కళేబరంతో బాధిత రైతు నిరసన తెలిపాడు. మృతిచెందిన గేదె విలువ రూ.1.20లక్షలు ఉంటుందని, నాలుగైదు రోజుల్లో ఈనడానికి సిద్ధంగా ఉందని బోరుమన్నాడు. చెరువు నీరు కలుషితం కావడానికి సమీపంలోని పర్యూ లైఫ్ సైన్సెస్ ఫ్యాక్టరీ వదిలే వ్యర్థ జలాలే కారణమని పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు జలాల్‌పూర్ పశు వైద్యాధికారి అఖిలతో కలిసి ఘటన స్థలానికి చేరుకుని గేదెకు పోస్టుమార్టం చేయించారు. గేదె అవయవాలను పరీక్షల నిమిత్తం ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపనున్నట్లు ఏఎస్ఐ జోజి తెలిపారు.

హార్డ్‌వేర్ దుకాణంలో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన దుకాణంలోని సామగ్రి, భవనం

బీబీనగర్ : మండల కేంద్రంలోని పోచంపల్లిరోడ్డులో గల శ్రీసాయితేజ సిమెంట్ ట్రేడర్స్ అండ్ హార్డ్‌వేర్ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి దాటాక ప్రమాదవశాత్తు భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. దుకాణం యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో దుకాణంలో ఇంటి నిర్మాణాలకు సంబంధించిన వివిధ రకాల వస్తువులు, పేయింటింగ్ డబ్బాలు ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. భారీ ఎత్తున మంటలు చేలరేగడంతో స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారని, రెండు ఫైర్ ఇంజన్ వాహనాలతో మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.2కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు యజమాని పలుగుల శ్రీనివాస్ గురువారం తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

కొండమల్లేపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం చింతచెట్టుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని పూల్‌సింగ్‌తండాలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పూల్‌సింగ్ తండాకు చెందిన నేనావత్ భాస్కర్, సక్కు దంపతుల మూడో కుమారుడు నేనావత్ రమేష్(32) పదేళ్ల క్రితం మిర్యాలగూడ మండలం మాటూరు తండాకు చెందిన భారతిని వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో గత ఐదేళ్ల నుంచి భార్య భారతి కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన రమేష్ గురువారం సాయంత్రం తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

130మంది రైతులకు నోటీసులు

చింతపల్లి : డిండి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణానికి చింతపల్లి మండల కేంద్రంలోని రైతుల నుంచి భూ సేకరణకు ఇరిగేషన్ శాఖ అధికారులు, జిల్లా స్పెషల్ కలెక్టర్ గురువారం సుమారు 130 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. మండల కేంద్రంలో ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ చేయగా అప్పట్లో కొంత మంది రైతులకు పరిహారంగా రూ.5.15లక్షలు అందించగా, గతంలో మరో 130మంది రైతులు భూసేకరణకు ఒప్పంద పత్రంపై సంతకం చేసినప్పటికీ వారికి పరిహారం అందించలేదు. ప్రస్తుతం 480ఎకరాలకు గాను 130మంది రైతులు గురువారం వ్యవసాయ పనులకు వెళ్లగా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా వారి ఇళ్లకు నోటీసులు అంటించారు. దీంతో కంగుతిన్న రైతులు అధికారుల తీరు పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.5.15లక్షలు పరిహారం అందిస్తామని చెప్పిందని, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పరిహారం అందించాలని, గతంలో సంతకాలు చేసిన రైతులతో పాటు సంతకాలు చేయని రైతులకు సమానంగా నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం

- ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి



కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

అడవిదేవులపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో రూ.70లక్షలతో నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన వర్గాల బాలికలు చదువుకునేందుకు, మధ్యలోనే చదువు మానివేయకుండా బాల్య వివాహాలను నివారించేందుకు కస్తూరిబా గాంధీ విద్యాలయం ఎంతో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలన్నారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ కరుణాకర్‌రావు, ఎంఈఓ బాలాజీనాయక్, పోదిల శ్రీనివాస్, కూరాకుల చిన రామయ్య, నాగేశ్వర్‌రావు, బాలునాయక్, ఉన్నత పాఠశాల హెచ్ఎం వరలక్ష్మి, పాఠశాల ప్రత్యేక అధికారిని నాగలక్ష్మి, ఎస్ఐ శేఖర్ తదితరులున్నారు.

ఆర్టీసీ కార్గో ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ రూరల్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) ఏజెంట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజియన్ సేల్స్ టీం లీడర్ శ్యాం కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో ఆసక్తి ఉన్న వారు రూ.5వేలు, ఇతర ప్రాంతాల్లో ఆసక్తి ఉంటే రూ.1000డీడీ చెల్లించాలన్నారు. వివరాలకు 91542 98690, 91542 98693, 91542 98694, 91542 98695ను సంప్రదించాలని కోరారు.

నిజాయితీగా ఉన్నందుకే టికెట్ రాలేదు

- ఉచిత బస్సు తప్ప మరేమీ పథకాలు అమలు కాలేదు
- పరీక్షలు వాయిదా వేయాలని వస్తే ఇనుప కంచెలు వేయడం సరైంది కాదు
- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



యాదాద్రీశుడి ఆలయంలో మోత్కుపల్లి నర్సింహులు తదితరులు

యాదగిరిగుట్ట: 'ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నా దగ్గర రూ.10కోట్లు ఉంటే ఎంపీ టికెట్ వచ్చేది.. నీతి, నిజాయితీతో ఉన్న కాబట్టే టికెట్ రాలేదు' అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. గురువారం తన పుట్టిన రోజు సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం, యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ జీవితంలో ఎక్కడా భూకబ్జాలు చేయలేదని, అక్రమాలకు పాల్పడలేదన్నారు. ఇప్పటికీ యాదగిరిగుట్ట పట్టణంలో గజం భూమి లేదని, అదే తన నిజాయితీకి నిదర్శనం అని అన్నారు. ప్రజలయందు వర్ధిల్లు నాయకుడు రాజకీయాలకు పనికి రాడని.. కోట్ల రూపాయాలు సంపాదించిన వాళ్లు నేటి రాజకీయాల్లో ఉంటున్నారన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో 80లక్షలు ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. 11 జనరల్ స్థానాలు ఉంటే.. వాటిలో కూడా ఒకే సామాజిక వర్గానికే అధిక సీట్లు ఇచ్చారని విమర్శించారు. ఒకే కులానికి సీట్లు, పదవులు ఇస్తామంటే బదుగు, బలహీన వర్గాలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. తాను కాంగ్రెస్ పార్టీని బతికించాలనే ఉద్దేశంతో ఆ పార్టీలో చేరానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 8 సీట్లకు పడిపోవడం అనేది బాధాకరమన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో 16 సీట్లు కాంగ్రెస్ గెలుచుకోవాల్సిన పరిస్థితి ఉన్న నేపథ్యంలో 8 సీట్లకు పడిపోవడం ఆలోచించాల్సిన అంశమని పేర్కొన్నారు. గ్రూప్స్, డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని నిరుద్యోగులు రోడ్లపైకి వస్తే ముళ్ల కంచెలు వేసి పోలీసులు కొడుతున్నారని, ఇది బాధాకరం అని అన్నారు. నిరుద్యోగులకు రూ.5వేల నిరుద్యోగ భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. పక్క రాష్ట్రంలో ఉన్న చంద్రబాబునాయుడు మూడు నెలల్లో 16వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్ణయం తీసుకున్నారన్నారు. రెండు నెలల బకాయిలు ఉన్న పింఛన్లు ఒకే రోజులో పంపిణీ చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు పక్కన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉందని, తెలంగాణాలో కూడా భట్టి విక్రమార్క ఫొటో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో ఫ్రీ బస్సు పథకం తప్పా.. ఏ పథకాలు ఇప్పటికీ అమలు కాలేదని మండిపడ్డారు. అంతకు ముందు కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు.